సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 27 । డిసెంబర్ । 2023



జ్యోతిక్షేత్రం.. భక్తజన సంద్రం

శ్రీ అవధూత కాశినాయన 28వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా జ్యోతిక్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. -8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సిద్దవటం ఫారెస్టు రేంజ్‌లో 35 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఒక తమిళ కూలీని అరెస్టు చేశారు. -8లో

మదనపల్లె: టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 233 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మార్చి 10 నుంచి గంగమ్మ జాతర

లక్కిరెడ్డిపల్లి : మార్చి 10 నుంచి 12 వరకు శ్రీ అనంతపురం గంగమ్మ తిరునాల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జరిగిన వేలం పాటలో రూ.21 లక్షల 34 వేల ఆదాయం వచ్చింది. టోల్‌గేట్‌లో రూ.5.20 లక్షలు, తలనీలాలు రూ.1.51 వేలు, విడి దినాల్లో టెంకాయల విక్రయం రూ.8.52 లక్షలు, షామియానా సప్లయర్స్‌ను రూ.6.11 లక్షలకు దక్కించుకున్నారు. నాలుగింటికి సరియైన వేలం పాట రాకపోవడంతో తరువాత వేస్తామని ఆలయ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, ప్రత్యేక అధికారి రవీందర్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి జనార్దన్, సర్పంచ్‌లు సామాల వెంకటనారాయణ రెడ్డి, గడ్డం ప్రభాకర్ రెడ్డి, ఆలయ కమిటీ మెంబర్లు ఉడుము సుబ్బరాయుడు, ఉప్పుతోట సుబ్బయ్య, పూజారి ఆదిమూలంరెడ్డి శేఖర్, రామచంద్ర పాల్గొన్నారు.

చిన్నారులకు గిన్నిస్ సర్టిఫికెట్లు



నృత్య గురువుతో బాలికలు

రాయచోటి టౌన్: రాయచోటి ప్రాంతానికి చెందిన ఇద్దరు చిన్నారి నృత్యకళాకారులు గిన్నిస్ బుక్ వారి సర్టిఫికెట్లు పొందారు. ఈ నెల 24న తెలంగాణలోని గచ్చిబౌలి మైదానంలో కూచిపూడి మహా నాట్య బృందంలో రాయచోటి పట్టణం నారాయణ పాఠశాలలో చదువుతున్న హేమశ్రీ, లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థిని ఉమా దుర్గావతి పాల్గొన్నారు. వారు తమ ప్రదర్శన చేసి గిన్నిస్ బుక్ వారి అభినందనలు అందుకున్నట్లు వారి తల్లిదండ్రులు తెలిపారు. వీరు ఇప్పటికే నృత్యం డీజే, మనీ డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొంది గిన్నిస్ బుక్‌లో తమ పేరు నమోదు చేసుకున్నారు.

ఎల్‌సీడీసీ సర్వేను విజయవంతం చేయండి



డీఎంహెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: జిల్లాలో జరుగుతున్న ఎల్‌సీడీసీ (కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం) సర్వేను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య కోరారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వైద్య సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పటికే ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఎంపిక చేసిన వలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి జనవరి 12 వరకు సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. అనుమానితులను వైద్య నిపుణులు పరీక్షించి నిర్ధారణ చేసిన తర్వాత ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. వ్యాధిని తొలిదశలో గుర్తించి చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా చేయవచ్చునని వివరించారు.

సాంకేతిక లోపంతో ఆగిన రైలు



తుమ్మనంగుట్ట రైల్వేస్టేషన్ వద్ద ఆపిన తిరుపతి ప్యాసింజర్ రైలు

బి.కొత్తకోట: తిరుపతి నుంచి గుంతకల్లు వెళ్తున్న ప్యాసింజర్ రైలు మంగళవారం మార్గంమధ్యలోని బి.కొత్తకోట-కురబలకోట మండలాల సరిహద్దులో సాంకేతిక లోపంతో ఆగిపోయింది. తిరుపతిలో బయలుదేరిన ప్యాసింజర్ రైలు మదనపల్లెరోడ్ నుంచి కురబలకోట రైల్వేస్టేషన్ దాటుకుని బి.కొత్తకోట మండలంలోని తుమ్మనగుట్ట రైల్వేస్టేషన్ వైపు వస్తోంది. కురబలకోటకు ఆరు కిలోమీటర్ల దూరంలోని 130/7 కిలోమీటర్ రాయి వద్ద రైలు ఇంజిన్‌కు సాంకేతిక లోపం తలెత్తింది. ఉదయం 11.10 గంటలకు ఆగిపోగా డ్రైవర్ ఎంత ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. ఈ విషయాన్ని ధర్మవరం రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు ఇంజిన్‌ను తీసుకొచ్చి రైలుకు అమర్చడంతో మధ్యాహ్నం 1.40 గంటలకు యథావిధిగా గుంతకల్లుకు బయలుదేరింది. కాగా సాంకేతిక లోపంతో రైలు ఆగిపోవడంతో.. గుంతకల్లు నుంచి తిరుపతికి వస్తున్న ప్యాసింజర్ రైలును బి.కొత్తకోట మండలంలోని తుమ్మనంగుట్ట రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. గుంతకల్లు రైలు వెళ్లాక తిరుపతి నుంచి పంపించారు. రైలు ఆగిపోవడంతో ప్రయాణికులు రెండున్నర గంటల పాటు ఇబ్బంది పడ్డారు. ఇటీవల ఈ మార్గంలో సాంకేతిక లోపంతో రైళ్లు ఆగిపోవడం ఇది మూడోసారి.

క్రీడా సంబురం



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు



రైల్వేకోడూరులో వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

- 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు ఆరంభం
- ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే
- ఫిబ్రవరి 10 వరకు నిర్వహణ
- జిల్లాలో 1.50 లక్షల మంది రిజిస్ట్రేషన్

రాయచోటి: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలు అంబరాన్నంటాయి. అట్టహాసంగా, పండుగ వాతావరణంలో మొదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో క్రీడాకారుల ఆనందోత్సాహాల మధ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వాలీబాల్ జాతీయ క్రీడాకారిణి, అన్నమయ్య జిల్లా బ్రాండ్ అంబాసిడర్ వసుమతిరెడ్డి పాల్గొన్నారు. తొలుత ముఖ్య అతిథులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. గాలిలోకి బెలూన్లను వదిలారు. శాంతికి చిహ్నంగా కపోతాలను ఎగురవేశారు. ప్రేక్షకుల హర్షాతిరేకాలు మిన్నంటాయి. మైదానంలో క్రీడాకారులతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు.

ఆరోగ్యంపై దృష్టి

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ చాలా వరకు చదువుకునేటప్పుడు మాత్రమే క్రీడల్లో పాల్గొని, ఆ తరువాత మరిచిపోతామని, నేడు అలా కాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి ఉంచి శారీరక దారుఢ్యం మెరుగుపరుచుకోవాలని ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. అలాగే మన రాష్ట్రంలో క్రీడలలో ప్రతిభ కలిగిన వారు చాలా మంది ఉన్నారని, వారిని వెలుగులోకి తేవాలంటే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఫిబ్రవరి 10వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న అతి పెద్ద మొట్టమొదటి స్పోర్ట్స్ టోర్నమెంట్ ఆడుదాం ఆంధ్ర అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల మంది పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వారందరూ పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి..

స్పోర్ట్స్ అంబాసిడర్‌గా పాల్గొన్న అంతర్జాతీయ క్రీడాకారిణి వసుమతి మాట్లాడుతూ తాను క్రీడల్లో పాల్గొనే రోజుల్లో ఎవరి సహకారం లేదన్నారు. కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారుల ప్రతిభను వెలికి తీస్తోందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ క్రీడల్లో స్వయంగా పాల్గొని క్రీడాకారులు, అభిమానులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగస్వామి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం, జిల్లా స్పోర్ట్స్ అధికారి చంద్రశేఖర్, స్పోర్ట్స్ ప్రధాన కోచ్ బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, మదనమోహన్‌రెడ్డి, కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, జాకీర్, గౌస్‌ఖాన్, రౌనక్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, సుగవాసి శ్యామ్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, జానం రవీంద్ర యాదవ్, జయన్న నాయక్, భాస్కర్, నేలపాటి వెంకటేష్, విక్కి దేవేంద్ర, చంద్రశేఖర్, కో ఆప్షన్ ఆసీఫ్ అలీఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాష్ట్రం ఆదర్శం

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన సీఎం జగన్ క్రీడల్లో కూడా మొదటి స్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలను గ్రామ, వార్డు సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లకు పైగా వయసు ఉన్న వారికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. రాయచోటిలోని క్రికెట్ స్టేడియాన్ని రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించుకునేలా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ప్రభుత్వ పథకాలతో ప్రజల్లో సంతోషం

కలెక్టర్ గిరీషా పీఎస్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

వీరబల్లి (రాయచోటి టౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. వీరబల్లిలోని జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రజలకు పథకాలు అందుతున్నాయన్నారు. పలు శాఖల అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభారి అధికారులు పీయూష్‌కుమార్, ప్రకాష్ కిచ్చి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీవో రామకృష్ణ, డీపీవో ధనలక్ష్మి, పశుసంవర్ధకశాఖ జెడీ గుణశేఖర్ పిళ్లై, ఎంపీడీవో మల్లీశ్వరి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా సిద్ధం చేయాలి

రాయచోటి : జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితా సవరణ అనంతరం తప్పులు లేని జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఓటరు జాబితా సవరణలు, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలపై మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి క్షేత్ర స్థాయిలో పక్కాగా పరిశీలన చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు రంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రామయ్య ఆశీస్సులతో జగన్ మళ్లీ సీఎం కావాలి

- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
- పాదయాత్రకు సంఘీభావం తెలిపిన ప్రముఖులు



జెడ్పీ చైర్మన్ ఆకేపాటి పాదయాత్రలో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్



ఒంటిమిట్ట క్షేత్రంలో ఆకేపాటి దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట/రాజంపేట/రాజంపేట రూరల్: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆశీస్సులతో వైఎస్సార్‌సీపీ వచ్చే ఎన్నికల్లో 175కు 175 అసెంబ్లీ సీట్లు గెలిచి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కోరారు. ఆయన మంగళవారం చేపట్టిన 9వ ఒంటిమిట్ట మహా పాదయాత్ర భక్తిపారవశ్యంతో కొనసాగింది. రాజంపేట మండల పరిధిలోని ఆకేపాడు శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయాల సముదాయంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సతీమణి జ్యోతమ్మ కలిసి తెల్లవారుజామున పూజలు చేశారు. అనంతరం సతీసమేతంగా పాదయాత్రను ప్రారంభించారు. వారి వెంట ఆకేపాడు గ్రామాలలోని భక్తులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు కదలివచ్చారు. ఒక వైపు మంచు కురుస్తున్నా.. చలిని లెక్కచేయకుండా పాదయాత్రలో పాల్గొని భక్తిభావం చాటుకున్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర సాగింది. మార్గం మధ్యలోని నందలూరులో నాయకులు సిద్దవరం గోపిరెడ్డి, అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, గడికోట వెంకటసుబ్బారెడ్డి, గీతాల నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు, అరిగెల మణి, హరిబాబు, మల్లికార్జునరెడ్డి, గ్రీస్మంత్‌రెడ్డి, నాగేంద్ర, జుల్ఫీకర్ ఘన స్వాగతం పలికారు. ఒంటిమిట్ట మండలంలోని మంటపంపల్లె వద్ద రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు జై చంద్రారెడ్డి కలిసి పూల మాలలు వేసి సంఘీభావం తెలిపారు. ఒంటిమిట్టలో కడప మేయర్ సురేష్‌బాబు, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ, గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి స్వాగతం పలికారు. కోదండరామస్వామి ఆలయానికి చేరుకున్న తర్వాత ఆకేపాటి తల నీలాలు సమర్పించి, స్వామిని దర్శించుకున్నారు. రంగమండపంలో ఆలయ అధికారులు సత్కరించారు. అర్చకులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుకు ప్రోత్సాహం



ఎస్ఎస్ఎస్ పథకం కింద జన్మించిన పేయదూడ



రైల్వేకోడూరులో బర్రెకు పేయదూడ

- ఎస్ఎస్ఎస్ పథకం అమలు
- రాయితీ ద్వారా ఇంజెక్షన్లు
- గ్యారంటీగా పేయదూడల జననం

పీలేరు: రాయలసీమలో ప్రధానంగా వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపైనే ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకొచ్చిన సెక్స్‌సార్టెడ్ సెమెన్ (ఎస్ఎస్ఎస్) పథకం వరంగా మారింది. ఇది పేయదూడల అభివృద్ధికి దోహదపడి 90 శాతం పైగా సత్ఫలితాలు ఇస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. పాడి రైతులు కోరుకున్న పేయదూడలు పొందడానికి లింగ నిర్ధారిత వీర్యం (ఎస్ఎస్ఎస్) ద్వారా వీలు కల్గింది. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని రాష్ట్రీయ గోకుల్ మిషన్ అందుబాటులోకి తీసుకురాగా, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అమలు చేస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2.77 లక్షల ఆవులు, లక్షకు పైగా బర్రెలు ఉన్నాయి. పేయదూడల వృద్ధితోపాటు పాల ఉత్పత్తులు పెంచడం ద్వారా రైతుల ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఎస్ఎస్ఎస్ పథకం కింద ఏడాది కాలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5185 ఇంజెక్షన్లు ఇచ్చింది. సుమారు 500 పేయదూడలు జన్మించాయి. పలు ఆవులు గర్భదశలో ఉన్నాయి. ఇప్పటి వరకు ఇచ్చిన ఇంజెక్షన్లతో ఐదారు నెలలు గడిస్తే దాదాపు వంద శాతం పేయదూడలు జన్మిస్తాయని అధికారులు చెబుతున్నారు.

లింగ నిర్ధారిత వీర్య నాళికలతో...

లింగ నిర్ధారిత వీర్యం (ఎస్ఎస్ఎస్) పథకంతో జెర్సీ, జెర్సీ క్రాస్, గిర్ ఆవులు, హెచ్ఎఫ్, సాహీవాల్, ముర్రాజాతి బర్రెలు మొదలైన మేలు రకాలు ఎంచుకోవచ్చు. ఈ పథకం కింద పాడి ఆవులకు కృత్రిమ గర్భధారణ ఇవ్వడానికి యదకు వచ్చిన ఆవుకు రెండు దఫాలుగా లింగ నిర్ధారిత వీర్య నాళికలు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో వీర్య నాళికకు రూ.675 చొప్పున రెండింటికి రూ.1350 చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వ రాయితీ పోనూ రైతులు రూ.500 చెల్లించాలి. పేయదూడలు పుట్టని పక్షంలో రైతులు కట్టిన సొమ్ము తిరిగి ఇచ్చేస్తామని అధికారులు చెబుతున్నారు.

రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం

పాడి రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం రాయితీతో గడ్డి విత్తనాలు, 60 శాతం రాయితీతో గడ్డి కోత యంత్రాలు ఇస్తోంది. అలాగే 50 శాతం రాయితీతో దానామృతం ఇవ్వడంతోపాటు పశువులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు అందిస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు వరంగా ఉన్న లింగ నిర్ధారిత వీర్యం (ఎస్ఎస్ఎస్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వీలైనంత ఎక్కువగా పాలిచ్చే పాడి సంతతిని పెంపొందించడం లక్ష్యంగా ఎస్ఎస్ఎస్ పథకం అమలవుతోంది. అవసరమున్న రైతులు సమీప పశువుల ఆస్పత్రుల్లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలి. – గుణశేఖర్‌పిళ్లై, జేడీ, పశుసంవర్ధకశాఖ, అన్నమయ్య జిల్లా

కోవిడ్‌పై అప్రమత్తం





మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఆక్సిజన్ సిలిండర్లను పరిశీలిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

- దేశంలో కరోనా జేఎన్–1 వేరియంట్ వ్యాప్తి
- ముందు జాగ్రత్తలు తీసుకుంటున్న జిల్లా యంత్రాంగం
- పీహెచ్‌సీల్లో టెస్టింగ్ కిట్లు సిద్ధం చేసిన అధికారులు
- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు

మదనపల్లె సిటీ: ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి రూపుమార్చుకుని వస్తున్న తరుణంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటి నుంచే ప్రజలు జాగ్రత్త పడాలని హెచ్చరికలు జారీ చేసింది. కేరళలో మొదలైన కరోనా కొత్త వేరియంట్ తెలంగాణాకు పాకింది. ఇప్పటికే దగ్గు, జ్వరంతోపాటు న్యుమోనియా జిల్లాను పట్టిపీడిస్తోంది. దీనికి వాతావరణ పరిస్థితి కూడా తోడయింది. దీంతో ఆస్పత్రులు కిక్కిరిసిపోవడంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. తాజాగా కరోనా జేఎన్-1 వేరియంట్ వ్యాప్తి దేశంలో మొదలైంది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రారంభించారు.

కొత్త వేరియంట్ లక్షణాలు

- జలుబు, దగ్గు, ముక్కు నుంచి కారడం
- తీవ్రమైన జ్వరం, వాంతులు కావడం
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
- తీవ్రమైన అలసట
- ఛాతీలో నొప్పి, వణుకు, వాసన గుర్తించలేకపోవడం
- తీవ్రమైన న్యుమోనియాతో ఊపిరితిత్తుల్లో సమస్యలు
- ఒళ్లు నొప్పులు, కొత్త వేరియంట్ పునరుత్పత్తి సామర్థ్యం ఎక్కువ విస్తరించే ఆస్కారం ఉంది. ఇది గతంలో కోవిడ్ ఇన్‌ఫెక్షన్ ఉన్న వ్యక్తులు, టీకాలు వేయించుకున్న వారికి కూడా సోకుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- దగ్గు, తుమ్ములు, ముక్కు నుంచి కారడం వంటి లక్షణాలు ఉన్న వారికి దూరంగా ఉండాలి.
- మాస్కులు ధరించాలి.
- జనసందోహ ప్రాంతంలో సంచరించరాదు.
- చేతులు తరచూ సబ్బుతో కడుక్కోవాలి.
- చలి ప్రదేశాల్లో తిరగరాదు.
- సాధ్యమైనంత వరకు దూర ప్రాంతాలకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి.
- దగ్గు, జలుబు, ఛాతీలో నొప్పి తదితర లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలి.

పీహెచ్‌సీల్లో పరీక్షలకు ఏర్పాట్లు

కోవిడ్ లక్షణాలున్న వారికి పరీక్షలు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. పీహెచ్‌సీల్లో ఆర్‌టీపీసీఆర్, ర్యాపిడ్ కిట్లు అందుబాటులో ఉంచారు.

ఏపీవీపీ ఆస్పత్రుల్లో కోవిడ్ మాక్ డ్రిల్

- జిల్లాలోని జిల్లా, ఏరియా, సీహెచ్‌సీల్లో కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ముందు జాగ్రత్తగా ప్రత్యేక పడకలు ఏర్పాటు చేశారు. ఆస్పత్రుల్లో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేక బెడ్లు ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సంటేటర్లు వంటివి ఏర్పాటు తదితరాలపై ప్రత్యేక చర్యలు చేపట్టారు.
- వైద్యులు అందుబాటులో ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ముందస్తు ఏర్పాట్లు చేశాం



జిల్లాలో అయితే ఎలాంటి వేరియంట్ లక్షణాలు కనిపించలేదు. అధికారుల ఆదేశాలతో ముందస్తుగా అప్రమత్తం చేశాం. ఆస్పత్రుల వారీగా బెడ్లు, ఇతర ఏర్పాట్లు చేశాం. వేరియంట్ భయం వద్దు. అలా అని నిర్లక్ష్యం వద్దు. జ్వరమని తెలిస్తే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. –కొండయ్య, డీఎంహెచ్‌ఓ, రాయచోటి

క్లుప్తంగా

వేధింపులపై ఫిర్యాదు

రామసముద్రం : తనను ఒక వ్యక్తి వేధిస్తున్నాడని రామసముద్రం మండలం చెంబకూరు గ్రామం మంగళవీధిలో నివాసమున్న మహిళా వలంటీర్ మంగళవారం రామసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మదనపల్లె మండలం ఆవులపల్లె పంచాయతీ నల్లరాజుగానిపల్లె గ్రామానికి చెందిన శ్రీనాథ్ తనను తరచూ వేధిస్తున్నాడని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

కారు.. బైకు ఢీ



రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగరాజు

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని గువ్వలచెరువు బస్‌స్టాప్ సమీపంలో మంగళవారం సాయంత్రం కారు–బైకు ఢీ కొన్న సంఘటనలో ద్విచక్రవాహనదారుడు నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు లక్కిరెడ్డిపల్లె మండలం దిన్నెపాడు గ్రామం అడివి వడ్డెపల్లెకు చెందిన ఆర్.నాగరాజు ఇంటి వద్ద నుంచి గువ్వలచెరువు వైపు బైకులో బయలుదేరాడు. పెట్రోల్ బంక్ సమీపానికి రాగానే వెనుక వైపు రాయచోటి నుంచి కడప వైపు వెళ్తున్న కారు బైకును ఢీ కొంది. ఈ ప్రమాదంలో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

మహిళ దారుణ హత్య



మృతురాలు శిల్ప

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట పరిధిలోని మంగంపేట అగ్రహారం వద్ద ఆవులకుంట్ల శిల్ప (35) అనే మహిళ హత్యకు గురైంది. పోలీసుల కథనం మేరకు శిల్పకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భర్తతో విభేదాల కారణంగా విడాకులు తీసుకుంది. ఈ నేపథ్యంలో మంగంపేటకు చెందిన ఆటో డ్రైవర్ షఫీని నాలుగు నెలల క్రితం వివాహం చేసుకుంది. మంగళవారం భర్తకు భోజనం పెట్టి గ్రామ సమీపంలోని స్కూల్ వద్దకు వెళ్లింది. కాసేపట్లోనే రక్త గాయాలతో శవమై తేలింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెను ఎవరు చంపారు అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

భర్త, అత్తపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం బెల్లంమండివీధికి చెందిన రేష్మా (30) అనే మహిళ తన భర్త షేక్ కరీముల్లా, అత్త అష్రపున్నీసాలపై ఫిర్యాదు చేసింది. ఐదు నెలల క్రితం షేక్ కరీముల్లాకు, రేష్మాకు వివాహమైంది. వివాహ సమయంలో కట్నం కింద ఏడుతులాల బంగారు ఆభరణాలను, 1.50 లక్షల నగదును ఇచ్చారు. కరీముల్లా పాన్‌షాపులో పనిచేస్తున్నాడు. తన భార్యకు తన కంటే ఎక్కువ వయసు ఉందని ఆమెను మానసికంగా వేధించేవాడు. దీనికి తోడు మరో రూ. 2లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని తల్లితో కలిసి హింసించడం మొదలు పెట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జ్యోతిక్షేత్రం.. భక్తజన సంద్రం



పూలతో అలంకరించిన కాశినాయన సమాధి



దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన జ్యోతిక్షేత్రం

- వైభవంగా కాశినాయన ఆరాధన మహోత్సవాలు
- నేడు రథోత్సవం, జ్యోతి ప్రజ్వలన

కాశినాయన : శ్రీ అవధూత కాశినాయన 28వ ఆరాధన మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులతో జ్యోతిక్షేత్రం పోటెత్తింది. కాశినాయన నామస్మరణతో నల్లమల్ల కొండలు మార్మోగాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా క్యూలు ఏర్పాటు చేసి కాశినాయన దర్శనం కల్పిస్తున్నారు. జ్యోతిక్షేత్రానికి చేరుకునేందుకు మైదుకూరు ఆర్టీసీ డిపోవారు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. దాదాపు రెండు లక్షల మంది భక్తులు ఆరాధనకు వస్తారని ఆలయ కమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. భక్తుల సంఖ్యకు దీటుగా భోజనవసతి, చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. జ్యోతి క్షేత్రం భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అంతేకాకుండా భక్తులు స్వచ్ఛందంగా సుమోలు, ఆల్విన్, లారీలు, ఆటోల్లో వస్తున్నారు. మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అర్ధరాత్రి కాశినాయన జ్యోతిస్వరూపం దర్శనమివ్వనుంది.

భారీ బందోబస్తు

ఆరాధన మహోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోరుమామిళ్ల సీఐ చిరంజీవి ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 175 మంది పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

స్వచ్ఛందంగా ధాన్యం, కూరగాయలు

కాశినాయన ఆరాధనకు భక్తులు స్వచ్ఛందంగా ధాన్యం, కూరగాయలు, నగదు సమర్పిస్తున్నారు. ఆరాధనకు అవసరమయ్యే 140 క్వింటాళ్ల బియ్యానికి రెట్టింపుతో ధాన్యాన్ని భక్తులు సమర్పించారు. అలాగే స్వచ్ఛందంగా కూరగాయలను భక్తులు సమర్పిస్తున్నారు. చాగలమర్రి, ఆళ్లగడ్డ ప్రాంతాలకు చెందిన దాదాపు 200 మంది వంట మనుషులు ఇక్కడి భక్తులకు రుచికరమైన వంటలు చేస్తున్నారు.

నేడు రథోత్సవం, జ్యోతిప్రజ్వలన

బుధవారం కాశినాయన రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో కాశినాయన మాల ధరించిన భక్తులు పాల్గొంటారు. అనంతరం కాశినాయన జ్యోతిస్వరూపం దర్శనమిస్తుంది. దీనిని చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

35 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- తమిళ కూలీ అరెస్టు
- మరో ఏడుగురు పరారీ



పట్టుబడిన నిందితుడు, ఎర్రచందనం దుంగలతో రేంజర్ కళావతి, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం ఫారెస్టు రేంజ్‌లోని సిద్దవటం బీటు ఎద్దుల గుండాలు అటవీ ప్రదేశంలో 35 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఒక తమిళ కూలీని అరెస్టు చేసినట్లు సిద్దవటం ఫారెస్టు రేంజర్ బి. కళావతి తెలిపారు. సిద్దవటంలోని అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. లంకమల అభయారణ్యంలోని సిద్దవటం బీటులో సోమవారం తమ సిబ్బందితో కలిసి కూంబింగ్ నిర్వహించామన్నారు. ఎద్దుల గుండాలు అటవీ ప్రదేశంలో మొద్దులు కింద పడేసే శబ్దం వినిపించడంతో తమ సిబ్బంది అప్రమత్తమయ్యారన్నారు. తమను చూసి కూలీలు పారిపోతుండటంతో తాము దాడి నిర్వహించి ఒక కూలీని అదుపులోకి తీసుకున్నామన్నారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. అక్కడ లభ్యమైన 35 ఎర్రచందనం దుంగలను, రెండు రంపాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దుంగల బరువు 509 కిలోలు ఉండగా, వీటి విలువ రూ.2.37 లక్షలు చేస్తుందన్నారు. పట్టుబడిన తమిళ కూలీని విచారించగా తాము మొత్తం 8 మంది వచ్చామని తెలిపాడన్నారు. తాము అరెస్టు చేసిన తమిళ కూలీ ధర్మపురి జిల్లా, శిట్టేరి గ్రామానికి చెందిన పెరుమాల్ సుబ్రమణి అని గుర్తించామన్నారు. ఈ మేరకు నిందితుడిని తిరుపతి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు, ఫారెస్టు బీటు అధికారి పెంచల్‌రెడ్డి, అసిస్టెంటు బీటు అధికారులు హైమావతి, నారాయణరెడ్డి, బేస్ క్యాప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో జిల్లా ఆస్పత్రి ఉద్యోగి మృతి



మృతి చెందిన రామాంజులు

మదనపల్లె : విధి నిర్వహణలోనే జిల్లా ఆస్పత్రి ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో జరిగింది. చిత్తూరు పట్టణానికి చెందిన చంద్రయ్య కుమారుడు ఎస్.రామాంజులు(42) వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీలో స్థిర పడ్డాడు. అతనికి భార్య ఉషారాణి, ఇద్దరు కుమార్తెలున్నారు. వృత్తిరీత్యా జనరల్ డ్యూటీ ఆపరేటర్ (ఎంఎన్‌ఓ)గా పని చేస్తున్నాడు. వాల్మీకిపురం, పీలేరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించాడు. గత జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఇక్కడికి వచ్చాడు. మంగళవారం ఆస్పత్రి విధుల్లో ఉండగా మధ్యాహ్నం ఛాతీలో నొప్పిగా ఉందని తన సహచరులకు చెప్పి అక్కడే ఉన్న ఫళంగా అపస్మారస్థితికి చేరుకున్నాడు. చికిత్స అందించేలోగానే మృతి చెందాడు. ఈ విషయాన్ని ఆస్పతి సిబ్బంది వాల్మీకిపురంలోని కుటుంబ సభ్యులకు తెలిపారు. అప్పటి వరకు తమతో పాటు పని చేసిన సహచరుడు మృతి చెందడంతో తోటి ఎంఎన్‌ఓలు, ఆస్పత్రి సిబ్బంది విషాదంలో మునిగిపోయారు. మృతుని భార్య ఆస్పత్రికి చేరుకుని కన్నీటి పర్యంతమైంది. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

చిట్టితల్లీ.. నీవులేని లోకంలో నేనుండలేను.!

కూతురి మరణాన్ని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య



మల్లేష్ (ఫైల్)

ఒంటిమిట్ట : పురుడు పోసుకున్న నెలరోజులకే పండంటి బిడ్డ తన కళ్లెదుటే కన్నుమూయడంతో ఆ తండ్రి హృదయం తట్టుకోలేకపోయింది. పసికందును మృత్యువు కబళించడంతో తీవ్ర వేదనకు గురయ్యాడు. చిట్టితల్లీ నీవు లేని లోకంలో నేనుండలేను అంటూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ హృదయ విదారక సంఘటన ఒంటిమిట్ట మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కమలాపురం మండలం, పుట్టంపల్లి గ్రామానికి చెందిన మేకల మల్లేష్ అలియాస్ శేఖర్ (28), మల్లేశ్వరి దంపతులకు ఏడాది క్రితం వివాహమైంది. నెలన్నర క్రితం మల్లేశ్వరి ప్రసవించి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కాని కొన్ని అనారోగ్య కారణాల వల్ల బిడ్డ ఆరు రోజుల క్రితం చనిపోయింది. దీంతో తీవ్ర వేదనకు గురైన మల్లేష్ సోమవారం తన అవ్వగారి ఊరైన ఒంటిమిట్ట మండలం, నందానగర్‌లోని ఎస్టీ కాలనీకి వచ్చాడు. అదే రోజు అతను తన తాతతో కలిసి మేకలు మేపుకునేందుకు నందానగర్ గ్రామ శివారులోకి వెళ్లాడు. తాత ముందుగానే ఇంటికి చేరుకున్నాడు. సాయంత్రం ఐదు గంటలు కావస్తున్నా మేకలను తీసుకుని మల్లేష్ ఇంటికి రాకపోవడంతో తాత గ్రామ శివారులోకి వెళ్లి చూశాడు. అక్కడ కింద పడి ఉన్న మల్లేష్ నోట్లో నుంచి నురగ కారుతుండటం కనిపించింది. వెంటనే ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలిపి, 108 సహాయంతో మల్లేష్‌ను కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం



కల్యాణ దంపతులైన ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతా సమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గల కల్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవ మూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాములకు సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి, నూతన పట్టువస్త్రాలు ధరింపజేశారు. తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సతీసమేతుడైన శ్రీ కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న పత్తికొండ ఎమ్మెల్యే



రంగమండపంలో ఎమ్మెల్యే శ్రీదేవి, తదితరులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను మంగళవారం పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో ఆమెకు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ కావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైలు ఇంజిన్ కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ములకల చెరువు : రైలు ఇంజిన్‌కింద పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ములకలచెరువు మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. కదిరి రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివారెడ్డి కథనం మేరకు.. కురబలకోట–తుమ్మనగుట్ట రైల్వే స్టేషన్ల మధ్యలో మధ్యాహ్నం తిరుపతి నుంచి గుంతకల్కు వెళ్లే ప్యాసింజర్ రైలు ఇంజన్‌లో సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. రైలు తరలించేందుకు గుంతకల్లు నుంచి వస్తున్న రైలింజన్ ములకలచెరువు స్టేషన్ వద్దకు రాగానే గుర్తుతెలియని వ్యక్తి ఇంజన్ కిందపడి చనిపోయాడు. గమనించిన రైల్వే అధికారులు కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నల్ల ప్యాంటు, తెల్ల షర్టు ధరించి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

సొంతిల్లు కట్టుకున్నాం



జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత సొంతిల్లు కట్టుకొని హాయిగా జీవిస్తున్నాము. జగనన్న దయవలన ఇల్లు మంజూరైంది. మా కష్టం తోడుచేసి సొంతిల్లు కట్టుకోవడం మాకు చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– భీమ రాధ, దేవమాచుపల్లి, చిట్వేలి మండలం, అన్నమయ్య జిల్లా

సులభంగా ధ్రువీకరణ పత్రాలు



గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే కార్యాలయాల చుట్టూ, మీసేవ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని గ్రామ వలంటీర్‌కు తెలియజేశాము. ఒక్క రోజులోనే సులభంగా ధ్రువీకరణ పత్రాలు అందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఆర్.అరుణ, దుర్గా నగర్, బోడుమల్లువారిపల్లె పంచాయతీ, పీలేరు మండలం

ట్రాక్టర్ బోల్తా

లింగాల : ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. వివరాలిలా.. లింగాలలో మంగళవారం నిర్వహించిన శ్రీ కాశిరెడ్డి నాయన ఆరాధనలో స్థానిక ఎస్సీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత వారు ట్రాక్టర్‌లో తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యంలో మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో లింగాలకు చెందిన ఎం.వెంకటేష్, కాంతమ్మల కుమారుడు అరుణ్ కుమార్ ఎడమ కాలు ట్రాక్టర్ ట్రాలీ కింద పడి నుజ్జునుజ్జయింది. అలాగే ఈ ప్రమాదంలో కొంత మంది పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గోడను ఢీకొన్న కారు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రహరీని మంగళవారం సాయంత్రం కడపకు చెందిన కారు బలంగా ఢీ కొట్టింది. ముళ్లకంచె, ప్రహరీ బలంగా ఉండి అడ్డుకోవడంతో కారు అక్కడే ఆగిపోయింది. విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి ఉంటే పరిస్థితి తీవ్రంగా ఉండేది. కడపకు చెందిన దాసు అనే వ్యక్తి, అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. కారు లోపల ఉన్నవారు ఎవరూ గాయపడలేదు.

ట్రాక్టర్ కింద పడి విద్యార్థి మృతి



జశ్వంత్ కుమార్ మృతదేహం

వల్లూరు : వల్లూరు మండల పరిధిలోని చిన్న నాగిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాపాఘ్ని నగర్‌కు చెందిన ఇళ్లగాల్ల జశ్వంత్ కుమార్ (14) అనే విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు పాపాఘ్ని నగర్‌కు చెందిన జస్వంత్ వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నాడు. సెలవు దినాల్లో అప్పుడప్పుడు వ్యవసాయ కూలిపనులకు వెళుతుంటాడు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలోని మరో ముగ్గురు యువకులతో కలిసి చిన్న నాగిరెడ్డిపల్లె పొలాలకు మినుము పంట కోతకు వెళ్లాడు. అక్కడ పని ముగిసిన అనంతరం ట్రాక్టర్‌కు వెనుక వైపు మినుము నూర్పిడి యంత్రాన్ని కట్టుకుని దానిపై కూలీలు కూర్చున్నారు. పొలాల నుండి తిరిగి వచ్చే క్రమంలో వేగంగా వస్తున్న ట్రాక్టర్ చిన్ననాగిరెడ్డి పల్లె సమీపంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో మినుము నూర్పిడి యంత్రం బోల్తా పడింది. దానిపై కూర్చున్న కూలీలు కింద పడ్డారు. వారిలో జశ్వంత్ కుమార్‌పై ట్రాక్టర్ పడడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు, స్థానికులు చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని తండ్రి ఇళ్లగాల్ల లక్షుమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

వల్లూరు : పుష్పగిరి పుణ్య క్షేత్రంలో పౌర్ణిమను పురస్కరించుకుని మంగళవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలి వచ్చిన భక్తులు పుష్పగిరి కొండకు కొబ్బరి కాయలు కొట్టి భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ, శ్రీ సంతాన మల్లేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. పెన్నా నదిలో స్నానాలు ఆచరించారు. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు ఉదయం నుంచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు తాగు నీటి సౌకర్యాలను కల్పించారు.

భర్త మందలించాడని ఆత్మహత్య



మృతి చెందిన జ్యోతి

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో నివాసముంటున్న మేకల జ్యోతి (27) అనే మహిళ మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మేకల జ్యోతి, ఆమె భర్త మేకల ఆనందబాబు కొండాపురం మండలం బుక్కపట్నం నుంచి బతుకు దెరువు కోసం పిల్లలతో కలిసి నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వచ్చారు. అక్కడ ఒక హాస్టల్‌లో పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడం.. భర్త మందలించడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీలలో సత్తా చాటిన ఆర్టీపీపీ విద్యార్థులు



పతకాలు సాధించిన డీఏవీ స్కూల్ విద్యార్థులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్ విద్యార్థులు జాతీయ తైక్వాండో పోటీలలో సత్తా చాటారు. ఏకంగా మూడు బంగారు పతకాలు, ఒక వెండి పతకం, నాలుగు కాంస్య పతకాలను విద్యార్థులు సాధించి జాతీయ స్థాయిలో రాష్ట్ర కీర్తిని చాటారని ఆర్టీపీపీ డీఏవీ స్కూల్ తైక్వాండో కోచ్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం స్కూల్‌లో జరిగిన సమావేశంలో విద్యార్థులు సాధించిన మెడల్స్‌ను పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా తైక్వాండో కోచ్ చంద్రశేఖర్ మాట్లాడుతు ఈ నెల 22, 23, 24 తేదీలలో విజయవాడలో సీహెచ్ఆర్‌కే స్టేడియంలో 38వ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీలలో దేశంలోని 13 రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పోటీ పడ్డారన్నారు. ఈ పోటీలలో మన రాష్ట్రం నుంచి డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్ విద్యార్థులు మనోజ్, శివదార్శిక, అరోహి, కౌశల్, సాత్విక, కార్తీక్, కార్తీకేయ, సృజన్ పాల్గొన్నారు. మనోజ్, శివదార్శిక, అరోహిలు బంగారు పతకాలు సాధించగా, కౌశల్ వెండి పతకం, సాత్విక, కార్తిక్, కార్తీకేయ, సృజన్‌లు కాంస్య పతకాలు సాధించారన్నారు. స్కూల్ ప్రిన్సిపల్‌తో పాటు జాతీయ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీవీ ప్రసాద్, జాతీయ తైక్వాండో గ్రాండ్ మాస్టర్ బీవీ రమణయ్యలు విద్యార్థులను అభినందించారు.

పుష్పగిరి ఆలయంలో పాము కలకలం



ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు పక్కన పడగ విప్పిన తాచు పాము

వల్లూరు : పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం తాచు పాము కలకలం సృష్టించింది. కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో అర్చకులు తెల్లవారుజామున ధనుర్మాస పూజలను నిర్వహించే క్రమంలో ఆలయ ప్రాంగణంలోని శ్రీ రాజ్య లక్ష్మీ అమ్మవారి ఆలయం ఎదుట ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లారు. స్వామి వారి మూలవిరాట్‌కు వెనుక వైపున తాచు పాము ఉండడాన్ని గుర్తించారు. దాంతో బయటికి వచ్చిన అర్చకులు పాములు పట్టే నిపుణులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి దాదాపు గంట సేపు పామును పట్టేందుకు ప్రయత్నించారు. పాము పడగ విప్పి బుసలు కొడుతూ చాలా సేపు అలాగే ఉండి పోయింది. సమీపంలోని పూజా పాత్రలను పడగతో బలంగా కొడుతూ నిలిచింది. చివరకు అతి కష్టం మీద పాములు పట్టే వారు పామును ఒక డబ్బాలోకి తరలించారు. అక్కడి నుండి బయటికి తీసుకొస్తుండగా నది నుంచి ఆలయంలోకి వచ్చే మెట్లపై కిందికి దూకి అక్కడి నుంచి జారుకుంది. దీంతో అర్చకులతో బాటు భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కాగా ఈ పాము సాధారణ తాచు పాముకు భిన్నంగా పడగపై తెల్లని చారలతో కొత్త రకంగా ఉందని భక్తులు తెలిపారు. కొండపై ఉన్న ఆలయంలో పాములు అడపా దడపా కనిపించినప్పటికీ ఇలాంటి కొత్త రకం పామును చూడడం ఇదే మొదటి సారని పురావస్తు శాఖ సిబ్బంది తెలిపారు.